ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 20 జూన్ 2025



షాపింగ్ సందడి

- జిల్లాలో జోరుగా సాగుతున్న వ్యాపారాలు
- ఎక్కడ చూసినా.. కొనుగోలుదారుల రద్దీ
- 'తల్లికి వందనం' నిధులు సద్వినియోగించుకునేలా ప్రణాళికలు



శ్రీకాకుళంలోని వస్త్రదుకాణంలో కిటకిటలాడుతున్న కొనుగోలుదారులు



శ్రీకాకుళంలోని బుక్‌స్టోర్‌లో కొనుగోలుదారుల రద్దీ

శ్రీకాకుళం, జూన్ 19(ఆంధ్రజ్యోతి):

పండగ సీజన్ మాదిరి జిల్లాలో ఎక్కడ చూసినా మార్కెట్ సందడి కనిపిస్తోంది. వస్త్రదుకాణాలు, పుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, సైకిళ్ల తదితర విక్రయ కేంద్రాలతోపాటు బంగారం షాపులు జనంతో నాలుగు రోజుల నుంచి కిటకిటలాడుతున్నాయి. శ్రీకాకుళంతోపాటు ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం తదితర ప్రాంతాల్లో షాపులన్నీ కొనుగోలుదారులతో రద్దీగా ఉన్నాయి. ప్రభుత్వం 'తల్లికి వందనం' నిధులు జమ చేయడమే ఇందుకు కారణమని స్పష్టమవుతోంది. ఇటీవల ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సంబంధించి.. వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో 'తల్లికి వందనం' పథకం పేరిట రూ.13 వేలు చొప్పున నిధులు జమ చేసిన విషయం తెలిసిందే. ఈ డబ్బులతో అందరూ సంతోషంగా షాపింగ్ చేస్తూ.. తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకుంటున్నారు. వాస్తవానికి జూన్‌లో వ్యాపారాలు డల్‌గా ఉంటాయి. కానీ, సీఎం చంద్రబాబు పుణ్యమా? (మిగతా 4వ పేజీలో..)

'తల్లికి వందనం'.. పిల్లల్లో ఆనందం



నరసన్నపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యార్థిని పేరు **రావాడ తనూజ**. నరసన్నపేట మండలం జమ్ము గ్రామం. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. జమ్ము నుంచి సుమారు మూడు కిలోమీటర్లు మేర దూరంలోని ఉన్న పాఠశాలకు ఆటోలో వెళ్లి వచ్చేది. ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకం కింద తనూజ తల్లి రమణమ్మ బ్యాంకు ఖాతాలో రూ.13 వేలు జమ చేసింది. ఆ డబ్బులను సద్వినియోగం చేసేలా తనూజ కోసం ఆమె తల్లిదండ్రులు రమ ణమ్మ, కృష్ణ సైకిల్ కొనుగోలు చేశారు. రెండు రోజులుగా ఆ సైకిల్ పైనే పాఠశాలకు వెళ్లి వస్తుండ దంతో తనూజలో ఆనందం వ్యక్తమవుతోంది. ఇదే మాదిరి చాలామంది తల్లిదండ్రులు 'తల్లికి వందనం' పథకానికి గుర్తుగా సైకిళ్లు, వెండి పట్టీలు, కొద్దిపాటి బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు.

'యోగాంధ్ర'కు సర్వసన్నద్ధం

- జిల్లా నుంచి 20వేల మంది విశాఖకు తరలింపు
- విజయవంతంగా ట్రయల్ రన్

శ్రీకాకుళం, కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు హాజరుకానున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నుంచి 20వేల మందిని విశాఖ తరలించనున్నారు. ఇందుకోసం 430 బస్సులను కేటాయించారు. గురువారం ఆయా బస్సుల ఇన్‌చార్జిలు, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. బస్సుల్లో ప్రయాణించే ప్రతీ బృందానికి బాధ్యత వహించే ఇన్‌చార్జిలను కలెక్టర్ ఎంపిక చేశారు. బస్సులు, పార్కింగ్ ప్రాంతాలు, వేదికల వరకు రాకపోకలు, పాల్గొనేవారికి అందించే ఆహారం, టీ-షర్టులు, మ్యాట్‌లు, వాటర్ ప్యాకెట్లు, మరుగుదొడ్ల లోకేషన్లను పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆహారంతోపాటు తాగునీరు, వైద్యం వంటి సౌకర్యాల కల్పనపై సూచనలు చేశారు. వేదికలో సీ-16 బ్లాక్ నుంచి మొత్తం 24 బ్లాక్‌లను భీమిలి బీచ్ రోడ్డులో శ్రీకాకుళానికి కేటాయించినట్లు సమాచారం. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ పాల్గొన్నారు.



ట్రయల్ రన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

అరసవల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. 'తెలంగాణలో మాదిరి ఆంధ్రాలో కూడా కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యంగా పనిచేద్దాం. గతంలో పార్టీలో పదవులు అనుభవించిన కొంతమంది పార్టీకి సహకరించకపోవడం దారుణం. పార్టీలో సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామ'ని షర్మిల తెలిపారు. బీజేపీని ఎదిరించగలిగే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, కేవీఎల్ఎస్. ఈశ్వరి, తెంబూరు మధుసూదనరావు, రెల్ల సురేష్, తర్లాన అశోక్, చిట్టిబాబు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచారం

ఐటీఐ రెండో విడత అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎల్.సుధాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీవోవీ ఇన్ అనే వెబ్‌సైట్‌లో జూలై 15లోగా వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలి. డౌన్‌లోడ్ చేసిన రిజిస్ట్రేషన్ ఫారం, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో జూలై 17లోగా పరిశీలన చేయించాలి. సీటు కోసం దరఖాస్తు చేసుకునే ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరు కావల్సి ఉంటుంది. కౌన్సెలింగ్ వివరాలను త్వరలో ప్రకటిస్తామ'ని సుధాకర్ తెలిపారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

ఎచ్చెర్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 20, 21 తేదీల్లో జరగాల్సిన వివిధ పరీక్షలను వాయిదా వేసినట్టు డీన్ డాక్టర్ జి.పద్మారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ 5,6 సెమిస్టర్ల స్పెషల్‌డ్రైవ్ పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షలను యోగాంధ్ర కారణంగా వాయిదా వేశామన్నారు. ఈ పరీక్షలను జూలై 9,10 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు.

డీఎస్సీకి 749 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీ కొనసాగుతోంది. గురువారం నిర్వహించిన పరీక్షకు 773 మంది అభ్యర్థులకుగానూ 749మంది హాజరయ్యారు. శ్రీశివానీ కళాశాల (చిలకపాలెం)లో 573 మంది అభ్యర్థులకుగానూ 555మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 200 మందికి 194 మంది పరీక్ష రాశారు.

యోగ దినోత్సవంలో పాల్గొనాలి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగ దినోత్సవంలో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 'యోగ ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్' అనే థీమ్‌తో ఈ నెల 21న యోగ దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా అడ్మినిస్ట్రేటివ్ న్యాయాధికారి సుబ్బారెడ్డి సత్తి హాజరవుతున్నారని తెలిపారు. యోగ కేవలం శరీరానికే కాదు.. మనసుకు కూడా విశ్రాంతినిచ్చే సాధన అని ఆయన స్పష్టం చేశారు.



జామియా మసీదు అభివృద్ధికి కృషి

- మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎమ్‌డీ ఫరూక్

శ్రీకాకుళం కల్చరల్/ అరసవల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో చారిత్రకమైన జామియా మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎమ్‌డీ ఫరూక్ అన్నారు. నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదును ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రహరీ ఎత్తు పెంచేందుకు కృషి చేస్తానని, మసీదు మరమ్మతులకు నిధులు మంజూరు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ద్వారా నిధులు కేటాయించేలా శ్రద్ధ వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండీ అన్వర్ బాషా, ఎండీ రఫీ, అబ్దుల్ గఫర్‌ఖాన్, షేక్ హుస్సేన్, షేక్ సలీం, రహీం పాల్గొన్నారు.

← జామియా మసీదును సందర్శిస్తున్న మైనారిటీశాఖ మంత్రి ఫరూక్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

సికిల్‌సెల్ అనీమియాను నిర్మూలిద్దాం

- డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సికెల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ అనిత పిలుపునిచ్చారు. ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఏడురోడ్లజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో అనిత మాట్లాడుతూ 'జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది ఈ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ వ్యాధి ముఖ్యంగా ఎర్రరక్త కణాలకు సంబంధించినది. జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి సంక్రమిస్తుంది. రక్తంలో ఎర్రరక్త కణాల సంఖ్య తగ్గిపోవడం, కళ్లు పసుపురంగులోకి మారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, అంటువ్యాధుల సంక్రమణ, గర్భధారణ సమయంలో సమస్యలు మొదలగునవి ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి నిర్ధారణ కిట్లు ప్రతీ ప్రభుత్వాసుపత్రిలోను అందుబాటులో ఉన్నాయి. ఈ వ్యాధిగ్రస్థులకు మాత్రలతోపాటు రక్తం ఎక్కించాల్సి ఉంటుంద'ని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్, డా.వెంకట్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, డిప్యూటీ డెమో ఎం.వేంకటేశ్వరరావు, ఎస్.విజయలక్ష్మి, మోహిని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వారికి.. సుఖీభవ లేనట్టే!



- జిల్లాలో 70వేల మందికి పైగా రైతులకు వర్తించని లబ్ధి
- వైసీపీ చేసిన రీసర్వే గ్రామాల్లోనే చిక్కులు
- వెబ్‌ల్యాండ్‌లో వివరాలు లేక ఆందోళన

- మెళియాపుట్టి మండలం గేదెలపోలూరు గ్రామానికి చెందిన సవర కృష్ణారావుకు గేదెలపోలూరు రెవెన్యూ పరిధిలో ఎకరా 9 సెంట్ల భూమి ఉంది. అతనే సాగు చేయడంతోపాటు వన్‌బీ, అడంగల్ కూడా ఉన్నాయి. కానీ, వీఏఏ లాగిన్‌లో కృష్ణారావుకు భూమి లేనట్లు చూపించడంతో ఆందోళన చెందుతున్నాడు. అన్నదాత సుఖీభవ పథకం వర్తించడం లేదని వాపోతున్నాడు.

- మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన నడిమింటి గోవిందరావుకు 59 సెంట్ల భూమి ఉంది. అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోగా.. వీఏఏ లాగిన్‌లో పేరు కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నాడు.

మెళియాపుట్టి, జూన్ 19(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో చాలా మంది రైతులు.. 'అన్నదాత సుఖీభవ' పథకం వర్తించక ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టగా.. ప్రస్తుతం అది తమ పాలిట శాపంగా మారిందని వాపోతున్నారు. తాము భూములు సాగు చేస్తున్నా.. వెబ్‌ల్యాండ్‌లో వివరాలు కనిపించకపోవడంతో పథకం వర్తించడం లేదని దిగులు చెందుతున్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్‌తో కలిపి రూ.20వేలు చొప్పున అందజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సాయం అందజేస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు రైతుసేవా కేంద్రాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను గ్రామ వ్యవసాయ సహాయకులు వీఏఏ లాగిన్ నుంచి మండల వ్యవసాయాధికారి లాగిన్‌కు పంపించారు. వెబ్‌ల్యాండ్ సర్వేనెంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం సరిగా ఉన్నాయో లేదో రైతుసేవా కేంద్రంలో పరిశీలించి పంపించారు. వాటిని తహసీల్దార్ పరిశీలించి.. స్టేట్ కమిషన్‌కు పంపించాలి. కాగా, జిల్లాలో 71,820 మంది వివరాలు వెబ్‌ల్యాండ్‌లో పెండింగ్ చూపిస్తున్నాయి. దీంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. తాము భూమి సాగుచేస్తున్నా, అన్ని హక్కుపత్రాలు ఉన్నా వీఏఏ లాగిన్‌లో కనిపించడం లేదని దిగులు చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం గతంలో చేపట్టిన భూముల రీసర్వే కారణంగా ఈ ఇబ్బందులు తలెత్తాయని పలువురు ఆరోపిస్తున్నారు. రీసర్వే చేసిన గ్రామాల్లో అధికంగా సమస్యలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డేటాతో సరిచేశాం..

ప్రభుత్వం నుంచి మాకు వచ్చిన డేటాను సరిచేసి రెవెన్యూ అధికారులకు పంపించాం. అధికంగా రీ సర్వే చేసిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్‌లో వివరాలు కనిపించటం లేదు. సమస్యలు ఉన్న రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

-లింగాల మధుబాబు, ఏడీ, వ్యవసాయశాఖ, పలాస

హాయ్.. హాయి.. బోన్సాయి

- ఆ యుద్ధ వీరుడు.. మొక్కల ప్రేమికుడు
- పురాతన వస్తువులూ సేకరణ

4లో

వెలుగు భవనానికి వీడని గ్రహణం

- పునాదిస్థాయిలోనే నిలిచిన పనులు
- పుష్కరకాలంగా కొనసాగుతున్న ఆటంకాలు

5లో

హాయ్.. హాయ్.. బోన్సాయ్


ఇంటి మిద్దెపై పెరుగుతున్న బోన్సాయి మొక్కలు..


ఖరీదైన పైకస్ మైక్రో కార్పా మొక్క.

- ఆ యుద్ధ వీరుడు... మొక్కల ప్రేమికుడు
- బోన్సాయి మొక్కలను పెంచుతున్న మాజీ సైనికుడు
- పురాతన వస్తువులూ సేకరణ

పలాస, జూన్ 19 (ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు తుపాకీ చేత పట్టి... శత్రువులతో పోరాడిన ఆ యుద్ధవీరుడు నేడు ఇంటి ఆవరణలో సున్నితమైన బోన్సాయి మొక్కలు పెంచుతూ... వాటిపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నాడు. దీంతో పాటుగా పురాతనమైన పాత వస్తువులు సేకరిస్తూ... తన ఇంటినే మ్యూజియంగా మార్చి.. నేటి తరం విద్యార్థులకు వాటి విశేషాలను తెలియజేస్తు న్నాడు. ఆయనే పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కుత్తుమ వినోద్ కుమార్. డిగ్రీ చదువుతుండగానే సైన్యంలో చేరారు వినోద్. పదవీ విరమణ తరువాత పీజీతో పాటు బీఈడీ పూర్తి చేశారు. ఇంటిలో ఊరకనే కూర్చోవడం ఎందుకని తనకు ఇష్టమైన మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టారు. అవి వినూత్నంగా ఉండాలనే ఉద్దేశంతో పెరడు మొక్కలను బోన్సాయి మొక్కలుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం మాకన్నపల్లి గ్రామంలో ఉంటున్న ఆయన ఇంటి చుట్టూ ఎన్నో బోన్సాయి మొక్కలు మనల్ని పలుకరిస్తాయి. వాటి కోసం ఎవరు వినోద కుమార్‌ను ప్రశ్నించినా మొక్కల శాస్త్రీయ నామాలతో పాటు వాటి వినియోగం, పెంచుకునే పద్ధతి... కలిగే లాభాలు..ఇలా మొత్తం పూసగుచ్చినట్టు చెబుతారు. రూ.10వేల విలువైన మొక్కను సైతం ఆయన నామమాత్రపు ఖర్చుతో తయారు చేసుకున్నారు. దీంతో పాటుగా మొక్కలపై ప్రయోగాలు చేస్తూ సత్ఫలితాలు పొందారు. ఆయన ఒకరోజు కడియం నర్సరీకి వెళ్లినప్పుడు హైబ్రీడ్ వాక్కాయి చెట్లు కనిపించాయి. వాటి పండ్లు తిని గింజలు వేయడంతో ప్రస్తుతం మొక్కలుగా మారాయి. నిండా పండ్లతో చూపరులను ఎంతో ఆకర్షిస్తున్నాయి.

ఇంటినే మ్యూజియంగా మలచి..

పురాతన కాలంలో వాడే సాధనాలు, వస్తువులను సేకరించి ఆయన తన ఇంటిలో ఓ గదిని మ్యూజి యంగా మలిచారు. కుటుంబ సభ్యులు కూడా సహకరించడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లి పాత వస్తువులు తీసుకువచ్చి వాటిని అందంగా అలంక రించారు. పళ్లెం, బుట్టలు, లాంతర్లు, కుంచాలు, మట్టి పాత్రలతో పాటు రేడియో, టేపు రికార్డర్, క్యాసెట్లు, టార్చ్‌లైట్లు సేకరించి మ్యూజియంలో పెట్టారు. ఉద్యోగాలకు అవసరమయ్యే స్టడీమెటీరియల్, వివిధ పుస్తకాలు కూ డా అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి తనకు మొక్కలు, పుస్తకాలు, పాత వస్తువులంటే ఎంతో ఇష్టమని చెప్పారు. ఉద్యోగ విరమణ అనంతరం తన తరువాతి తరం వారికి అందించాలనే ఉద్దేశంతో వీటిని ఇష్టంగా ఇంటివద్దనే పెంచుతున్నానని తెలిపారు. మొక్కలు కావాల్సిన వారు తనను సంప్రదిస్తే వాటిని ఏ విధంగా తయారు చేయాలో చెబుతానన్నారు.


బోన్సాయి మొక్కలతో వినోద్‌కుమార్


వినోద్ సేకరించిన పాతకాలం నాటి వస్తువులు

షాపింగ్ సందడి

(మూడో పేజీ తరువాయి)

అని తమ వ్యాపారాలు జోరందుకున్నాయని వ్యాపారులు కూడా సంబరపడుతున్నారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు పడడంతో.. పండగ సీజన్ మాదిరి వ్యాపారాలు సాగుతున్నాయని పేర్కొంటున్నారు.

గతంలో ఒక్కరికే.. ఇప్పుడు అందరికీ..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకున్నా 'అమ్మఒడి' పథకం ద్వారా కేవలం ఒకరికి మాత్రమే లబ్ధి చేకూర్చేవారు. అది కూడా గతేడాది ఎగనామం వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే 'తల్లికి వందనం' పథకం కింద ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ రూ.13 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేసి చూపించారు. జిల్లాలో 2,28,659 మంది విద్యార్థులకు సంబంధించి 1,52,563 మంది తల్లులు ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. సుమారు అన్ని ఇళ్లల్లో ఇద్దరు పిల్లలకు రూ.26వేలు, ముగ్గురు నుంచి ఐదుగురు పిల్లలున్నవారికి ఒక్కొక్కరికి రూ.13వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో ఇటీవల జమ చేశారు. ఎన్నో కుటుంబాలకు లబ్ధి కలగడంతో.. వాటిని సద్వినియోగం చేసుకునే లా.. వస్తువులు.. బంగారం ఆభరణాలు.. ఇతరత్రా వాటిని కొనుగోలు చేసుకుంటున్నారు. మరోవైపు పాఠశాలలు తెరచుకున్న వేళ.. శ్రీకాకుళంలో ఏడురోడ్ల జంక్షన్‌లో ఉన్న వస్త్రదుకాణాలు, బుక్ స్టోర్స్.. బ్యాగ్‌లు, షూస్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిట లాడుతున్నాయి. పాత బస్టాండ్ వద్ద రిలయన్స్ మార్ట్, డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద రిలయన్స్ డిజిటల్‌తోపాటు ప్రముఖ షాపింగ్ మాల్స్, ఫర్నిచర్ దుకాణాల్లో రద్దీ కనిపిస్తోంది. రామలక్ష్మణ జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఉన్న సైకిల్ షాపుల్లో కూడా జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. కొంతమంది తల్లులు.. తమకు వచ్చిన డబ్బులతో కొద్దిపాటి బంగారు ఆభరణాలను, వెండి పట్టీలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మరికొంతమంది టీవీలు, ఫ్రిజ్‌లు కొనుగోలు చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా అన్ని దుకాణాల్లోనూ సందడి కనిపించడంతో వ్యాపారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం

ఇచ్ఛాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాకు ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, యోగా గురువులు కామరాజు, సంజీవ్‌రెడ్డి అన్నారు. ఎలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సురంగిరాజా మైదానంలో మూడు రోజుల యోగా శిక్షణ కార్యక్రమా న్ని నిర్వహిస్తున్నారు. తొలిరోజు గురువారం 500 మంది యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, క్రీడా కారులతో మెగా యోగా డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ రమేష్ మాట్లాడుతూ శారీరక ధృడత్వానికి... మానసిక ప్రశాంతతకు యోగా దోహదపడు తుందని అన్నారు. రోజూ యోగా సాధ న చేయడం వల్ల ఒత్తిడిని తగ్గిచుకోవ చ్చునని అన్నారు. గ్రామ గ్రామాన యో గా సాధన చేయాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గురువు కామరాజు యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, యోగా గురువు డి.కృష్ణ మూర్తిరెడ్డి, క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి, క్లబ్ సభ్యులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆసనాలు వేస్తున్న యువత, విద్యార్థులు



యోగా శిక్షణ ఇస్తున్న గురువులు


డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన దృశ్యం

మూడో కంటితో చూసి..

- నగర శివారుల్లో డ్రోన్‌తో నిఘా

శ్రీకాకుళం, క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న శాంతినగర్ కాలనీ, నాగావళి రివర్ వ్యూ పార్క్, బలగ తదితర నదీ పరీవాహక, పట్టణ శివారు ప్రాంతాల్లోని నిర్మానుష్యమైన ప్రదేశాల్లో పోలీసులు డ్రోన్‌తో నిఘా పెట్టారు. నగర శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్‌స్నాచింగ్ తదితర నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇలా నిఘా పెట్టినట్టు పోలీసులు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రెండో పట్టణ పోలీసులు హెచ్చరించారు.

ఆధార్ అనుసంధానం కోసం..

- నమోదు కేంద్రాలు కిటకిట

నరసన్నపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' పథకంలో ఆధా ర్ అప్‌డేట్ కాని తల్లుల బ్యాంకు ఖాతాలను ఫోన్ నెంబర్, ఆధార్‌తో లింక్ చేసి ఈనెల చివరి నాటికి సచివాలయాలకు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆధార్ నమోదు కేంద్రాల వద్ద మహిళలు బారులు తీరుతున్నారు. నరసన్నపేట పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఆవరణలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రం వద్దకు రోజూ వందలాది మంది ఆధార్ అనుసంధానం కోసం వస్తున్నారు. సచివాలయాల్లో 'తల్లికి వంద నం' పథకంలో పెండింగ్‌లో ఉన్న వారి కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు.


యూనియన్ బ్యాంకులో రద్దీగా ఉన్న దృశ్యం

ఉద్దానానికి తాగునీరు అందించండి

- కిడ్నీ బాధితులకు మెరుగైన సేవలే లక్ష్యం
- జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- ప్రజాప్రతినిధులు లేక వెలవెలబోయిన 'స్థాయి' సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ విజయ


జెడ్పీటీసీలు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉద్దా నం ప్రాంతంలో తాగునీరు సక్రమంగా అందించాలని.. పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ పిరి యా విజయ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో స్థాయీ సంఘ సమావేశాలు గురువారం నిర్వహించారు. సమావేశాల్లో వివిధ శాఖల అధికారులు నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సుధాకరరావు మాట్లాడు తూ ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 పనిదినాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు ఫారం పాండ్స్ ఎంతో ఉపయోగపడతా యన్నారు. శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే అత్యధికంగా పనులు చేపట్టిన జిల్లాగా నిలిచిందన్నారు. కవిటి, సోంపేటకు డయాలసిస్ సేవలను పెంచాలని, బాధి తులకు మెరుగైన సేవలందించాలని వైద్యారోగ్యశాఖ సమీక్షలో అధికారులను సభ్యులు కోరారు. ఉద్దానం ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీని తక్షణమే అరిక ట్టాలని సభ్యులు కోరారు. లో ఓల్టేజీ సమస్యను పరిష్క రించి, విద్యుత్తు సరఫరాను మెరుగుపరచాలని విద్యుత్తు శాఖ సమీక్షలో కోరారు. సమావేశానికి చాలా మంది జడ్పీటీసీలు గైర్హాజరు కావడంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఈ సమావేశాల్లో జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యు లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బొడ్డకాళి గ్రామలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దేవాలయ 22వ వార్షికో త్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకం గా అలంకరించి.. పూజలు చేశారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషే కాలు, హోమాలు, కుంకు మ పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అలరించింది. కోలాటం గురువు తిప్పన ధనుంజయరెడ్డి కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, లండ కృష్ణారెడ్డి, జలంధర్‌రెడ్డి, శంకర్, నూకయ్య, ఉదయ్ కుమార్, బచ్చు మోహన్‌రావు, లింగరాజు, చిన్న, లక్ష్మీనారాయణ, వెంకటేశం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


కోలాటాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు


శ్రీకూర్మనాథుని మూలవిరాట్

22న శ్రీకూర్మనాథుని జయంతి

గార, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శ్రీమహా విష్ణువు దశావతారాల్లో రెండోదైన శ్రీకూర్మం క్షేత్రంలోని శ్రీకూర్మనాథుని జయంతి ఉత్సవం ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో నరసింహనాయుడు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ఏటా జ్యేష్ఠ బహుళ ద్వాదశి రోజున ఇక్కడ స్వామి వారి జయంతి ఉత్సవం నిర్వహించ డం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఆదివారం ఉదయం ఉత్సవాన్ని నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తులను మండపంలో ఉంచి.. నవ కలశ స్నపనం, ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామి వారి అవతార వైభవాన్ని వివరిస్తారు. భక్తులు స్వామి వారి జయంతి ఉత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.


స్వామి వారిని పూలతో అలంకరించిన దృశ్యం


కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులు

ఘనంగా ఉమాజఠలేశ్వరుని కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక నక్క వీధిలో ఉన్న ఉమా జఠలేశ్వరుని ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకులు బి.అశ్విని కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారిని పూలతో అలంకరించి... క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు భవనానికి వీడని గ్రహణం

- పునాదిస్థాయిలోనే నిలిచిన పనులు
- ముందుకు సాగని నిర్మాణం

పొందూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా పొందూరు శ్రీశక్తి (వెలుగు) భవనం పరిస్థితి తయారైంది. ఈ భవన నిర్మాణానికి నిధులున్నా పనులకు నోచుకోవడం లేదు. పుష్కర కాలంగా వెలుగుభవనానికి పట్టిన గ్రహణం వీడడంలేదు. శంకుస్థాపన జరిగిన ఏడేళ్లకు పునాదులు పడినా.. నిర్మాణానికి నోచుకోక పునాదుల్లోనే నిలిచిపోయింది. 12 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి ఈ భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేసి, శంకుస్థాపన సైతం చేశారు. అనంతరం రాష్ట్ర విభజన సమయంలో సమైఖ్యాంధ్ర నిరసనలతో నిర్మాణం నిలిచిపోయింది. ఆ తర్వాత 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషితో ఈ భవన నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారు. 2019 జనవరి 11న ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ భవన నిర్మాణానికి మరోసారి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమై పునాదుల వరకు సాగింది. ఆ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. 25 శాతంలోపు జరిగిన పనులను రద్దుచేయాలని వైసీపీ ప్రభుత్వం పాలసీ నిర్ణయం తీసుకోవడంతో ఈ భవన నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. ఈ క్రమంలో వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ఈ భవన నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.



పునాదిస్థాయిలోనే నిలిచిన పనులు



2019లో ఎమ్మెల్యే రవికుమార్ వేసిన శిలాఫలకం

ఎమ్మెల్యేపైనే ఆశలు

గత తెలుగుదేశం ప్రభుత్వంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్‌పైనే డ్వాక్రా మహిళలు, మండల మహిళా సమాఖ్య సభ్యులు ఆశలు పెట్టుకున్నారు. ఎంఎంఎస్ సభ్యులు ఈ విషయాన్ని రవికుమార్ దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లగా.. సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తుంది.

హామీ ఇచ్చారు

మధ్యలో నిలిచిన వెలుగుభవన నిర్మాణ విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లాం. సొంతభవనం లేక పడుతున్న ఇబ్బందులు తెలియజేశారు. నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

- జి.శ్యామలరావు, ఏపీఎం పొందూరు

'యోగాంధ్ర' వైపు ప్రపంచం చూస్తోంది

- బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖా మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రణస్థలం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర వైపు ప్రపంచం చూస్తుందని, యోగా సాధనతో సంపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చునని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన యోగాంధ్ర కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. ఈనెల 21న విశాఖలో జరగనున్న యోగా కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు గిన్నీస్ బుక్కు ఎక్కనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి 10 వేల మంది హాజరుకానున్నరని, వీరి కోసం బీమిలి బీచ్ రోడ్డులో (సీ-117, సీ-126) కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, రామాంజనేయులు, కూటమి నాయకులు శ్రీనివాసరెడ్డి, విశ్వక్సేన్, చౌదరి బాబ్జీ, పొగిరి సుగుణాకర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామకాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన ముగ్గురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలను గురువారం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తన బంగ్లాలో గురువారం అందజేశారు. పాణిగ్రాహి సిద్దేశ్వర్ కంచిలి ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్‌గా, బిడ్డిక మధుశ్రీ ఎంపీడీవో సీతంపేటలో ఆఫీసు సబార్డినేట్‌గా, ఇళ్ల మేఘనా, గార ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా నియమితులయ్యారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, పరిపాలనాధికారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు అనుమతి సరికాదు

లావేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం రెవెన్యూ పరిధిలో గల జగనన్న కాలనీకు సమీపంలో వెంకటరావుపేట గ్రామస్థులకు శ్మశానవాటికకు అనుమతి ఇవ్వడం సరికాదని మాజీ ఎంపీపీ దన్నాన రాజీనాయుడుతో పాటు ఆ కాలనీవాసులు అన్నారు. ఇక్కడి తాత్కాలికంగా ఏర్పాటు చేసన శ్మశాన వాటికను ఎత్తివేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. కొద్ది రోజుల కిందట వెంకటరావుపేటకు చెందిన జగ్గురోతు పార్వతమ్మ చనిపోగా ఆమె మృతదేహాన్ని మా కాలనీకు సమీపంలో గల గుమడాం వైపు వెళ్లే బీటీ రోడ్డు పక్కన దహన సంస్కారాణలు చేశారన్నారు. ఆ గ్రామానికి శ్మశాన వాటిక సమస్య ఉంటే, ఆ గ్రామ పరిధిలో ఏర్పాటు చేయించుకోవాలని, మా కాలనీకు సమీపంలో నిర్వహించడంపై తహసీల్దార్‌ను నిలదీశారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్ కుమార్



నియామక పత్రం అందుకుంటున్న సురేష్‌కుమార్

శ్రీకాకుళం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూటి కుప్పల సురేష్‌కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్ర యు వజన విభాగం కార్యదర్శిగా నాగళ్ల మురళీధర్, జిల్లా కార్యదర్శిగా కవిటి దేవరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శిగా కిల్లి కుమార స్వామి నియమితులయ్యారు. సురేష్‌కుమార్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



పార్టీ నాయకులను సన్మానిస్తున్న బొడ్డబడ గ్రామస్థులు

ఇచ్ఛాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన లోపింటి పద్మనాభం అన్నారు. గురువారం బొడ్డబడ గ్రామంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో గల 21 పంచాయతీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. నూతన కార్యవర్గం సభ్యులతో పాటు మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డిలను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.

చంద్రబాబుతోనే సంక్షేమం

ఆమదాలవలస, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని మునిసిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కేపే రాములు అధ్యక్షతన విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. తల్లికి వందనం పథకాన్ని ప్రతి విద్యార్థికి వర్తింప చేయడం గొప్ప విషయమన్నారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ మాట్లాడుతూ.. గతేడాది ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనర్ గొంటి గిరిధర్, ఎస్ఎంసీ చైర్మన్ చిగురుపల్లి సుశీల, స్టాఫ్ సెక్రటరీ పైడి రామస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే తొగరాం గ్రామంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా కిట్లును పంపిణీ చేశారు.

అందరి సహకారంతో పండగ విజయవంతం

పొందూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పొందూరు పట్టణంతో పాటు ఏడు గ్రామాల్లో నిర్వహించిన పైడితల్లి అమ్మవారి పండగ అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, పట్టణ టీడీపీ నాయకులు అన్నారు. అధికారులు, నిర్వహణ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కూన రవికుమార్ తరచూ సమీక్షించి తగిన సూచనల, సలహాలు ఇవ్వడం కలిసివచ్చిందన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ రూ.13.50 లక్షల ప్రత్యేక నిధులు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు ఎ.చినరంగ, బాడాన గిరి, దండా రవికుమార్, కె.శ్రీనివాసరావు, అనకాపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి నిత్యావసరాలు అందజేత

గార, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొర్లాం గ్రామంలో అగ్ని ప్రమాద ఘటనలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన బాధితుడు కొర్లాపు అప్పారావుకు గురువారం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి బియ్యం, బట్టలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

- పీయూసీ చైర్మన్ కూన రవికుమార్



మాట్లాడుతున్న పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రత్యేకఅతిథిగా పాల్గొంటున్న ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని పీయూసీ చైర్మన్ కూన రవికుమార్, ప్రత్యేక పరిశీలకులు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధికారులను, నాయకులను కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సభ విజయవంతంపై నాయకులు, అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా యువత ఈ సభలో పాల్గొనేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, టీడీపీ నాయకులు ఎ.రాము, చింతాడ వాసుదేవరావు, బలగ శంకరభాస్కర్, సీపాన శ్రీరంగనాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వీవోఏల వేతనాల పెంపుపై హర్షం



విప్ అశోక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీవోఏలు

ఇచ్ఛాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మా బతుకుల్లో వెలుగు నింపేందుకు విశేషంగా కృషి చేసి వేతనాలు పెంపుదలకు కారకులైన ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ మేలు మరిచిపోలేమని వీవోఏలు అన్నారు. వేతనాలు పెంచడానికి కృషి చేసిన ఎమ్మెల్యేను రామయ్యపుట్టుగలో ఆయన నివాసంలో గురువారం కలిసి సత్కరించారు. తాము మరింత ఉత్సాహంగా ప్రాజెక్ట్, ప్రభుత్వ కార్యక్రమాల్లో పనిచేసి మంచిపేరు తీసుకొచ్చేలా కష్టపడతామని తెలిపారు. జీతాలు పెంచినందుకు ముఖ్యమంత్రి, సెర్ప్ మంత్రి, పీడీ డీఆర్‌డీఏలకు ధన్యవాదాలు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు

ఇచ్ఛాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చింతాడ శరత్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. మందస జూనియర్ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేసి పదోన్నతిపై ఇచ్ఛాపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించండి

సరుబుజ్జిలి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయం చేస్తున్న రైతులు వ్యవసాయశాఖ అందించే ఆధునిక సాగు పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ ఏడీ బి.రాజగోపాల్, రిటైర్డు జేడీ రమణమూర్తి తెలిపారు. గురువారం మండలంలోని వెన్నెలవలస గిరిజన గ్రామంలో ఎరువులు, విత్తనాలు ఒకేసారి వేసే సాగు విధాన క్షేత్ర ప్రదర్శనలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పిస్తూ షేర్లతో విత్తనాలు వేయడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చునన్నారు. ముఖ్యంగా పంట మార్పిడి అనేది నేల ఆరోగ్యానికి అవసరమని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు అత్తులూరి లావణ్య, పాతిన శ్రీనివాసరావు, శివ్వాల కుమారి, రైతులు సవర శివకుమార్, నేతింటి బాలపల్లి రాజారావు, అత్తలూరి నారాయణరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు పి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళం నగర పాలకసంస్థ కార్యాలయం వద్ద ఆ సంఘ కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం 36 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సంఘీభావం ప్రకటించి ఇంజనీరింగ్ కార్మికులకు న్యాయం చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కార్య క్రమంలో కార్మికుల సంఘ నాయకులు జె.గురుమూర్తి, పార్థసారథి, శ్రీను పాల్గొన్నారు.

మొబైల్ ఐసీటీసీ వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత సమగ్ర ఆరోగ్య ప్రచారం కోసం మొబైల్ ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్, టెస్టింగ్ సెంటర్) వాహనాన్ని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారి నేతృ త్వంలో ప్రచార కార్యక్రమానికి ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుందని డీఎం హెచ్‌వో అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాత శ్రీకాకుళం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతిల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా గురుకుల సమన్వయకర్త గ్రేస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న బాలురకు దుప్పలవలసలో, బాలికలకు ఎచ్చెర్లలో ఈ నెల 25వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 970173 6862, 90003 14209 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

సర్వర్ పనిచేయక అవస్థలు

లావేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్లు పనిచేయక పోవడంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఈ సమస్య గడచిన నెల రోజులుగా వేదిస్తునే ఉంది. కుల, ఆదాయ, భూములు, రేషన్‌కార్డులు తదితర రకాల ధ్రువపత్రాలు సకాలంలో మంజూరు కాకపోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకం మంజూరు కానివారు తమడేటాను సరిచేయించుకునేందుకు వస్తున్నారు. అయితే కార్యాలయంలోని సర్వర్లు మొరాయిస్తుండడంతో సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సందించి ఇక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేలం పాటకు కౌన్సిల్ ఆమోదం

ఇచ్ఛాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ పరిధిలో గల 10 మునిసిపల్ షాపులకు గతంలో నిర్వహించిన వేలంపాటకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గురువారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. మునిసిపాల్టీ పరిధిలో ఖాళీగా ఉన్న పాత పంచాయతీ ఆఫీస్ షాపులు ఆరు, ప్రభుత్వాసుపత్రి రోడ్‌లో గల మరో నాలుగు షాపులకు ఈ నెల 13న కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా గురువారం కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ షాపులకు వచ్చే నెల 1వ తేదీ నుంచి మూడేళ్ల కాలపరిమితికి లీజుకి కౌన్సిల్ ఆమోదించినట్టు కమిషనర్ తెలిపారు.

ఉద్దానం రైతులను ఆదుకోవాలి

ఇచ్ఛాపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉద్దానం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి రవికిరణ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన షర్మిలకు ఉద్దానం రైతులు సమస్యలు వివరించారు. ఉద్దానంలో కొబ్బరి పంటకు తెల్లదోమ శోకడం వల్ల రైతులు నష్టపోయారని తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకొనేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు, వంశధార నదీజలాలను ఇచ్ఛాపురం బాహుదానది వరకు తరలించిలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. కిడ్నీ బాధితులకు డయాలసిస్ సెంటర్లలో బెడ్స్ పెంచాలని, యూనివర్సిటీ పోస్టులు భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

జి.సిగడాం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మద్దువలస కుడి ప్రధాన కాలువా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని క్వాలిటీ కంట్రోల్ ఏఈ కె.విశ్వనాథ్, ఏఈ రాజశేఖర్ అన్నారు. పెంట గ్రామ పరిధిలో జరుగుతున్న పనులను గురువారం వారు పరిశీలించారు. ఈ ఖరీఫ్‌కి పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట నీటి యాజమాన్య సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ, తదితరులు ఉన్నారు.

వరివిత్తనాల పంపిణీ

లావేరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): చినమురపాకలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 300 క్వింటాల వరివిత్తనాలు పంపిణీ చేశారు. జడ్పీటీసీ ఎం.సీతంనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పి.వంశీ, జి.పూర్ణిమ, నాయకులు రమణబాబు, నర్సింహులు పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో యోగాసనాలు

ఎచ్చెర్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో గురువారం యోగాసనాలు వేశారు. యోగసాధన వల్ల కలిగే ప్రయోజనాలను వీసీ కేఆర్ రజని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

- సోంపేట, జూన్19(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని బారు వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు అన్నారు. గురువారం యోగాపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు స్నేహలత, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సోంపేట: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా బోనెల అప్పారావు



బోనెల అప్పారావు

శ్రీకాకుళం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా బోనెల అప్పారావు నియమితులయ్యారు. మంగళగిరి టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఏపీ ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న అప్పారావును.. శ్రీకాకుళం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడిగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన అప్పారావు మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి పార్టీలో క్రియాశీలక బాధ్యతలను అప్పగించడంపై టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా కమిషనర్‌ను కలిసిన ఉపాధ్యాయులు



కంచిలి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమానికి వచ్చిన పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజును ఎంటీఎస్ ఉపాధ్యాయులు కలిసి సమస్యలు వివరించారు. కౌన్సెలింగ్ విషయం ప్రతీ మండలంలో సర్దుబాటు చేయాలని కోరారు. ప్రాతినిధ్యం చేసిన రాష్ట్ర ఎంటీఎస్ ఉపాధ్యాయులు సంఘం ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

జి.సిగడాం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని టీడీపీ నాయకులు బాలబొమ్మ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సంతవురిటి మోడల్ పాఠశాలలో విద్యామిత్ర కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, వైస్ఎంపీపీ టి.వెంకటరావు, నీటియాజమాన్య సంఘం అధ్యక్షుడు బాలబొమ్మ చినబాబు, పీఎంసీ అధ్యక్షురాలు దివ్య, హెచ్‌ఎం వి.విష్ణు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవస్థలు



కొమనాపల్లిలో రోడ్డుపై నిలువ ఉన్న నీరు

కొమనాపల్లి మెయిన్ వీధిలో కాలువలు లేకపోవడంతో ఏ మాత్రం వర్షం పడినా రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. దీంతో దోమలు ఉత్పత్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షపు నీటితో పాటు ఇళ్లలోని వాడుకనీరు రోడ్లపైకి వస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువల నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.

-జలుమూరు, ఆంధ్రజ్యోతి

ప్రమాదకరం

చిత్రంలో చూస్తున్నారు కదా.. ఇది జలుమూరు మండలం కూర్మనాథపురం వద్ద బుడితి-బద్రి మార్గంలో చోడవరం బ్రాంచి కాలువ వద్ద దుస్థితి. ఇటీవల రోడ్డు వేసిన సమయం లో కొంతమేర ఈ కాలువపై వంతెన నిర్మించారు. కాలువలోని షట్టర్లు ఉన్న వైపు రోడ్డు విడిచిపెట్టేయడంతో కుంగిపోయింది. కాలువలో నీటి ప్రవాహం పెరిగితే షట్టర్లు కొట్టుకుపోయే ప్ర మాదం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తు న్నా రు. అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో పటిష్ఠం చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-నరసన్నపేట, ఆంధ్రజ్యోతి



రోడ్డు కోరుకుపోయి ప్రమాదకంగా ఉన్న దృశ్యం

దారుణం



బెండికొండ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

బెండి కొండ వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి దారుణంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గోతుల్లో నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. వాహనాలు సైతం పల్టీ కొట్టి బురదలో పడిపోతున్నాయని పలువురు వాహన చోదకులు పేర్కొంటున్నారు. వైసీపీ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో హడావుడి చేసి వదిలేయడంతో ఇటువంటి పరిస్థితి నెలకొందని అంటున్నారు. తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-వజ్రపుకొత్తూరు, ఆంధ్రజ్యోతి

వాహనాలను తనిఖీ చేయాలి



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న డీసీ శ్రీకాంత్

మెళియాపుట్టి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గాను చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ తప్పనిసరిగా నిర్వహించాలని, ఈ దిశగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ ఆదేశించారు. గురువారం వసుంధర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే విడిచిపెట్టాలన్నారు. ఆయనతో పాటు చెక్‌పోస్టు మోనటరింగ్ అధికారి కోట కృష్ణారావు, సిబ్బంది ఉన్నారు.

ఆటోస్టాండ్‌లో యువకుల వీరంగం

పలాస, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్ రోడ్డు ఆటో స్టాండ్ వద్ద గురు వారం సాయంత్రం యువకులు వీరంగం సృష్టించారు. తాగిన మైకంలో రోడ్లపై ముష్టి ఘాతాలతో రెచ్చిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పాఠశాల విడిచిపెడుతున్న సమ యంలో ఆకతాయలు ఈ ప్రాంతంలో బైక్‌లపై వచ్చి బాలికలపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. యువకుల మధ్య కొట్లాటపై కాశీబుగ్గ పోలీసులకు సమాచారం వెళ్లడంతో వారు చేరుకొని యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో పోలీసులు వారిని విచారిస్తున్నారు.

విత్తనాల కోసం గిరిజన రైతుల నిరీక్షణ

కొత్తూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విత్తనాల కోసం మెట్టూరు బిట్-3 సచివాలయం చుట్టూ గత మూడు రోజులుగా తిరుగుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని మెట్టూరు గూడ గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నామని, అయితే సకాలంలో విత్తనాలు ఇవ్వాల్సిన అధికారులు కాలయాపన చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై సచివాలయ వీవోఏ కుసుమ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా విత్తనాల కోసం సచివాలయానికి వచ్చే రైతులు వివరాలు నమోదు చేసి విత్తనాలు సరఫరా చేస్తున్నామని, ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదన్నారు.

'గిరిజనుల సమస్యలు గాలికొదిలేస్తున్నారు'

మెళియాపుట్టి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. గురువారం గొట్టిపల్లి పంచాయతీ ఎత్తైన కొండల నడుమ ఉన్న చందనగిరి ఇతర గిరిజన గ్రామాల్లో పర్యటించారు, స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చందనగిరి తదితర గిరిజన గ్రామాల ప్రజలు రేషన్ కోసం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నేలబొంతు గ్రామానికి వెళ్లి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వైసీపీ హయాంలో గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించామని, అయితే కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు గ్రామానికి చేసిందేమీ లేదని విమర్శించారు.

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ ధ్యేయం

హరిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని గిరిజన సమాజమే ప్రభుత్వ ధ్యేయమని, దీనికిగాను ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందని ఏపీవో పైడి కూర్మారావు అన్నారు. చీపి గిరిజన గ్రామంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో దర్తీ అన్ భగీధరి అభియాన్ ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే సర్వే నిర్వహించినట్లు తెలిపారు. రక్షిత తాగునీరు, విద్య, వైద్యం, సంపూర్ణ ఆహారం, శానిటేషన్ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలపై స్వయంశక్తి సంఘాలు పంచ సూత్రాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వరప్రసాద్, ఏవో నాగరాజు, ఏపీవో హరికృష్ణ, ఉపాధి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'బోయిన' కుటుంబానికి నేతల పరామర్శ

టెక్కలి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సాధికారత కన్వీనర్, రాష్ట్ర కళింగ కోమట్ల సంఘ అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు మాతృమూర్తి ప్రేమకుమారి మృతి చెందడంతో గురువారం పలువురు టీడీపీ, వైసీపీ నేతలు పరామర్శించారు. గోవిందరాజులతో పాటు ఆయన సోదరుడు కోటబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్ తదితరులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, మాజీ మంత్రులు గౌతు శివాజీ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ తదితరులు పరామర్శించి ఓదార్చా రు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జీ, పినకాన అజయ్‌కుమార్, డాక్టర్ మెండ ప్రవీణ్, టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి పేడాడ తిలక్, అన్నెపు రామా రావు, రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి తదితరులు పరామర్శించారు.

ఘనంగా గుండిచా మందిర ప్రారంభం

ఎల్.ఎన్.పేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేటలో వెలసిన జగన్నాథ స్వామి గుండిచా మందిర ప్రారంభం, ప్రతిష్ఠోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా రథయాత్ర సందర్భంగా జగన్నాథ స్వామి ఈ మందిరంలో 10 రోజుల పాటు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మందిరాన్ని సర్వాంగసుందరంగా నిర్మించి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

● ఎమ్మెల్యే గౌతు శిరీష



ఉన్నత పాఠశాల తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక సాయి కాలనీలో యూపీ పాఠశాల అప్‌గ్రేడ్ కాగా గురువారం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు చదువుతు న్నారని, వారి తల్లిదండ్రుల వినతి మేరకు 9, 10 తరగతులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. అన్ని వసతులతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూని ఫారాలు, స్కూల్ బ్యాగ్ కిట్లు అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాల విద్యను బలోపేతం చేస్తోందన్నారు. 'తల్లికి వందనం' ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు బదిలీ చేశామని, విద్యార్థుల వికాసానికి ఈ నిధులు వినియోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధన చేసి విద్యార్థుల సంక్షేమానికి పాటు పడాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆదరణ ద్వారా లబ్ధిదారులకు పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యూపీ తరగతులను కొనసాగించాలి

● పాఠశాల ఎదుట ఆందోళన

హరిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): హొన్నాళి గ్రామంలో ఏన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న యూపీ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. సుమారు 160 మంది విద్యార్థులున్న పాఠశాలలోని 6, 7, 8 తరగతులను సుదూరంలోని పొత్తంగి సిరిపురం హైస్కూల్‌లో విలీనం చేయడం దారుణమన్నారు. చెరువులు, రెండు గెడ్డలు దాటి పాఠశాలకు వెళ్లాలంటే పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. సమస్యలను గుర్తించి గ్రామంలోనే యూపీ తరగతులను కొనసా గించాలని కోరారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భారీ ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



హొన్నాళి పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

విత్తన గుళికల తయారీతో దిగుబడి



కొత్తూరు: విత్తన గుళికల తయారీని వివరిస్తున్న డీపీఎం

కొత్తూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వరి విత్తన గుళికలు తయారు చేసి వినియోగించడం వల్ల పంటలో నాణ్యత పెరిగి దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం పూజారి సత్యనారాయణ అన్నారు. గురువారం శోభనాపురంలో రైతులకు విత్తన గుళికలు తయారీపై అవగాహన కలిగించారు. పంటలు వేసే ముందు విత్తనశుద్ధి చేసే అలవాటు చేసుకోవాలన్నారు. దీనితో చీడిపీడల నుంచి పంటలను రక్షించుకు నేందుకు అవకాశం ఉం టుందన్నారు. విత్తన గుళికలు తయారీకి బంక మట్టి పౌడర్, ఘన జీవామృతం, పొయ్యి బుగ్గి వినియోగించి విత్తనాలను శుద్ధి చేసి ఆరుబయ ఆరబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంటి సూర్యనారాయణ, చిన్నమ్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ఎల్.ఎన్.పేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని వెలుగు డీపీఎం ధనుంజయరావు అన్నారు. పెద్దకోట గ్రామ సమీపంలో ప్రకృతి వ్యవ సాయం పంటలను గురువారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలను ఆహారం గా తీసుకుంటే శారీరక ఆరోగ్యంతోపాటు ఎలాంటి వ్యాధులు రాకుండా మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం యు.రామకృష్ణ, సూర్యనారాయణ, రమణ, యూనిట్ ఇన్‌చార్జి లత, సంతోషి, రైతులు పాల్గొన్నారు.

యోగాభ్యాసంపై ఆసక్తి పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



యోగాభ్యాసం చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ యోగాభ్యాసంపై ఆసక్తిని పెంపొందించు కోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్టీ నేతలతో కలిసి యోగాభ్యాసం చేశారు. ఈనెల 21న విశాఖలో జరగనున్న జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో అన్ని మండలాల నుంచి నేతలు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, కార్యదర్శి మడ్డు రామారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా ట్రయల్ రన్‌కు అధికారులు



యోగాంధ్ర మాక్ శిక్షణకు వెళుతున్న వారితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వేంకటేశ్వరరావు

నరసన్నపేట,జూన్ 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 21న ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేసేందుకు గాను పలువురు అధికారులు, నాయకు గురువారం ట్రయల్ రన్‌కు విశాఖ వెళ్లారు. క్షేత్రస్థాయిలో మాక్ యోగాలో పాల్గొనేం దుకు ప్రత్యేక బస్సుల్లో బయల్దేరారు. విశాఖపట్నం బీచ్ రోడ్డులో జరిగే యోగా కార్యక్రమంలో అందరూ ఒకేలా యోగా చేసేలా ట్రయిల్ రన్ నిర్వహించినట్లు యోగాంధ్ర నియోజకవర్గ పర్యవేక్షణాధికారి, డీఎఫ్‌వో వేంకటేశ్వరరావు అన్నారు. నాలుగు మండలాల నుంచి 80 మందికి శిక్షణకు పంపించామన్నారు. శుక్రవారం ఉదయం 12 గంటలకు సుమారు 1200 మందిని ప్రత్యేక బస్సుల్లో విశాఖపట్నం తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.

ఘనంగా దువ్వాడ శ్రీధర్ జన్మదిన వేడుకలు



కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న దువ్వాడ శ్రీధర్

పలాస, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, శిరిడి సాయి సంస్థాన్ ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్(బాబా) జన్మదిన వేడుకలు గురువారం శివాజీ నగర్‌లోని ఆయన స్వగృహంలో అభిమానుల ఆనందోత్సాహాలనడుమ నిర్వహించారు. పలాస నియోజక వర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య శ్రీధర్ కేకు కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దువ్వాడ శ్రీకాంత్, గొర్లె వేణుగోపాల్, కూన హేమాచలం, దువ్వాడ నవీన్ కుమార్ చౌదరి, వరిశ భాస్కరరావు, డొక్కరి రాజారావు, సాహుకారి నాగేశ్వరరావు, బద్రి సీతమ్మ, మల్లా లక్ష్మణరావు, సప్ప రమణ, బాబూ రావు, కూన సాయివర్ధన్, శ్యామ్, బమ్మిడి సురేష్, కె.మధు, ఎ.ధనరాజ్, జి.రామ్ నరేష్, సత్తారు తేజేశ్వరరావు, ధవళ శ్యామ్, ఎ.రవి. కె.రవి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

23న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

టెక్కలి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, కెరియర్ రిక్రూట్‌మెంట్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ అర్హతలను బట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నారున్నారు. ఈ జాబ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ మండల కార్యవర్గం ఎన్నిక

హిరమండలం,జూన్19(ఆంధ్రజ్యోతి): హిరమండలం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పాతపట్నం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడిగా ధనుపురం సర్పంచ్ దారపు డిల్లేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా కొల్లి నాగరాజు, ఉపా ధ్యక్షుడిగా సాహుకారి గోవిందరావులను ఎన్నుకున్నారు. కొత్త మండల కమిటీ సభ్యులను జడ్పీటీసీ బుచ్చిబాబు, అంబావల్లి నీటి సంఘం అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు తదితరులు అభినం దించారు.

రెవెన్యూ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

నందిగాం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించనున్న రెవెన్యూ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.రామారావు ఒక ప్రకటనలో కోరారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ పిలుపు మేరకు ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో రెవెన్యూకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

యోగా నిర్వహణపై ఆరా

నందిగాం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నిర్వహించనున్న యోగా కార్యక్ర మంపై యోగా ప్రత్యేకాధికారి, వంశధార ఈఈ బి. శేఖరరావు ఆరా తీశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై ఎంపీడీవో కుమార్ పట్నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈవోపీఆర్డీ రాజారావు ఉన్నారు.

కిరాణా దుకాణాల్లో తనిఖీ

వజ్రపుకొత్తూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పూండి మార్కెట్‌లోని కిరాణా షాపులలో రెండు రోజులుగా ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేపట్టారు. కొన్ని దుకాణాల్లో కల్తీసరుకులు, నిల్వ ఉన్న సరుకులు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ఆహార భద్రత అధికారి శ్రీరాములు తెలిపారు. కొన్ని శ్యాంపిల్స్‌ను సేకరించారు. వీటిని పరీక్షించిన తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండలంలో ఇతర దుకాణాల్లో తనిఖీలు చేపట్టనున్నామని చెప్పారు.

రోడ్డుపైనే భవన నిర్మాణం?



రోడ్డుకు అనుకుని నిర్మించిన భవనం

నరసన్నపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దపేటలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద రోడ్డుకు అనుకునే భారీ భవన నిర్మాణం చేపట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. భవనం మెట్లను జగన్నాథపురం వైపు తిరిగే మార్గంలో రోడ్డుపై నిర్మించారని స్థానికులు ఆరోపించారు. భవన నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని, ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై ఈవో ద్రాక్షాయిణి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా పరిశీలించి రోడ్డు మీదకు నిర్మాణం చేపడితే తొలగించడం జరుగుతుందన్నారు.

కాలువ పనుల్లో కదలిక



గొటివాడ వద్ద కాలువలో పూడిక తొలగించిన దృశ్యం

నరసన్నపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో శివారు ప్రాంతాలకు సాగునీరందించేందుకు ఉపాధి హామీ నిధులు మంజూరు కావడంతో పనులు చేపడుతున్నారు. గత పదిహేను రోజులుగా జలుమూరు, నరసన్నపేట, పోలాకి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కాలువల్లోని పిచ్చి మొక్కలు తొల గించి, గట్లను పటిష్ఠం చేస్తున్నారు. సుమారు రూ.3 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. మెయిన్ బ్రాంచ్ కాలువతో పాటు, నరసన్నపేట బ్రాంచ్ కాలువ పనులు చేపట్టే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ముమ్మరంగా..

వజ్రపుకొత్తూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వంశధార కాలువ పనులు ముమ్మరంగా సాగు తున్నాయి. గత ఐదేళ్ల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సాగునీటిపై ప్రధాన దృష్టి సారించి ఎమ్మెల్యే గౌతు శిరీష కాలువల్లో పూడిక తీసి నీటి పారుదలకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఉపాధి పథకం నుంచి నిధులు విడుదల కాగా చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపడుతున్నారు. అలాగే కాలువల్లోని పిచ్చి మొక్కలు తొలగించి శివారు భూములకు సాగునీరందేలా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ఏడాది ఎలాంటి ఇబ్బందులు లేకుండా వంశధార నీటిని ప్రారంభం నుంచే శివారు భూములకు అందించాలనే ఉద్దేశంతో పనులు చేపడుతున్నట్లు వంశధార ఏఈ రాజశేఖర్ చెప్పారు. ఇప్పటికే చాలావరకు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామన్నారు.



బెండి వద్ద పూడిక తీస్తూ..